సాక్షి నిజామాబాద్

ఆదివారం । 3 । నవంబర్ । 2024



రాష్ట్రస్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

సారంగాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి అండర్–17,19 బాలికల క్రికెట్ జట్లను ఎంపిక చేశారు.

- 8లో ▸



అణగారిన వర్గాల కోసం..

అణగారిన వర్గాలకు మేలు జరిగేలా సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /19.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

19 మందికి నియామక పత్రాలు



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా విద్యాశాఖలో ఇటీవల డీఎస్సీ 2024లో ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు 19 మందికి శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ నియామక పత్రాలు అందించారు. ఎస్జీటీ విభాగంలో 1:3 నిష్పత్తిలో ధ్రువ పత్రాల పరిశీలన జరిగింది. మొత్తం 46 మంది హాజరయ్యారు.

బాధ్యతలు చేపట్టిన గడుగు గంగాధర్



నిజామాబాద్ సిటీ : రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియామకమైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ శనివారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గడుగుకు పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కమిషన్ తొలి సమావేశం చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించినట్లు గడుగు గంగాధర్ తెలిపారు.



శబరి కొండను ఎక్కుతున్న గురుస్వామి శర్మ

కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాలను జయించేందుకు అయ్యప్ప దీక్ష మంచి మార్గమని గురుస్వామి, సంస్కృత పండితులు బాల్యపల్లి సుబ్బారావు శర్మ పేర్కొన్నారు. 36 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్న ఈ గురుస్వామి 80 సార్లు శబరి కొండకు వెళ్లి వచ్చారు. వేలాది మంది అయ్యప్ప దీక్షాపరులకు గురువుగా వ్యవహరిస్తున్నారు. కైలాస మానస సరోవర యాత్రలు, 12 జ్యోతిర్లింగాలు, 18 శక్తి పీఠాల్లో చండీహోమాలు నిర్వహించారు. భక్తిని వ్యాపారంగా మారిస్తే ధర్మం నశిస్తుందని చెబుతున్న సుబ్బారావు పండితులు అయ్యప్ప దీక్షకు సంబంధించి పలు అంశాలపై 'సాక్షి' ముఖాముఖిలో మాట్లాడారు.





నిగ్రహానికి నిదర్శనం.. అయ్యప్ప దీక్ష



గురుస్వామి సుబ్బారావు శర్మ

- పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు జయించడమే ముఖ్యం
- పంచమహాభూతాలను గుప్పిట్లో పెట్టుకునేలా 41 రోజులు దీక్ష చేస్తే మంచి ఫలితం
- కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాలను జయిస్తేనే మోక్షం
- అయ్యప్ప అంటే ధర్మశాస్తా, యోగశాస్త్ర
- గురుస్వామి, సంస్కృత పండితులు బాల్యపల్లి సుబ్బారావు శర్మ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: అయ్యప్ప దీక్ష అంటేనే నిగ్రహానికి నిదర్శనమని, పంచేంద్రియాలను, కర్మేంద్రియాలను జయించి పంచమహాభూతాలను గుప్పిట్లో పెట్టుకోవాలంటే 41 రోజుల అయ్యప్ప దీక్షకు మించినది లేదని ప్రముఖ అయ్యప్ప గురుస్వామి, సంస్కృత పండితులు బాల్యపల్లి సుబ్బారావు శర్మ చెబుతున్నారు. కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాలను జయించేందుకు అయ్యప్ప దీక్ష మంచి మార్గమన్నారు. అయ్యప్ప స్వామిని ధర్మశాస్తా అని పిలవడంతో పాటు యోగశాస్త్ర అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. సుబ్బారావు గురుస్వామి 6వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు సంస్కృతంలోనే చదివారు.

ప్రాథమిక విద్యను ధర్మపురి సంస్కృత పాఠశాలలో, కళాశాల విద్యను వేములవాడ సంస్కృత కళాశాలలో, బీఈడీ (సంస్కృతం),ఎంఏ (సంస్కృత సాహిత్యం), ఎంఏ (తెలుగు) కోర్సులను తిరుపతిలోని సంస్కృత విద్యాపీఠంలో చదివారు. సంస్కృత సాహిత్యంలో భాగంగా సాహిత్య దర్పణం, నాటకాలు, పంచకావ్యాలు (రఘువంశం, కుమార సంభవం, కిరాతార్జునీయం, శిశుపాల వధ (మాఘం), నైష ధం (విద్యదౌషధం)) అభ్యసించారు. ఇందూరు జిల్లాలో 1985 నుంచి 2015 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పండితుడిగా పని చేశారు. పౌరోహిత్యం, పూజాదికాల సేవలందించేందుకు గాను 10 సంవత్సరాల సర్వీసు ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఇప్పటివరకు 36 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్న ఈ గురుస్వామి 80 సార్లు శబరి కొండకు వెళ్లి వచ్చారు. వేలాది మంది అయ్యప్ప దీక్షాపరులకు గురు వుగా వ్యవహరిస్తున్నారు. కైలాస మా నస సరోవర యాత్రలు, 12 జ్యోతిర్లింగాలు, 18 శక్తి పీఠాల్లో చండీహోమాలు నిర్వహించారు. ఇక మంత్ర విధానంతో పూజలు, ముద్ర విధానంతో శోఢచోపచారాలు, బీజాక్షరాన్ని జోడించి మళయాల తాంత్రిక విధానంతో అధిష్ఠాన దైవం అయ్యప్ప పూజ చేయడం ఈయన ప్రత్యేకత. వేలాదిగా పడిపూజలు నిష్ఠతో నిర్వహించారు.

దీక్ష పై గురుస్వామి శర్మ చెప్పిన అంశాలు

సత్వ, రజో, తమో, గుణాలకు అతీతంగా ఉంటే అవిద్య, అజ్ఞానాన్ని జయించొచ్చు. సత్యాన్ని పొందుతారు. సత్యమే అనంత బ్రహ్మ, జ్ఞానమే అనంత బ్రహ్మ. అయ్యప్ప 18 మెట్ల సాధన ద్వారా సాధ కుడు తత్వమసి నేర్చుకోవచ్చు. ఆదిశంకరులు చెప్పిన అద్వైత సిద్ధాంతంతో పాటు 6వ ఉపాసన (షణ్ముఖ ఉపాసన) ఉంది. దీన్నే కుమార ఉపాస న అంటారు. యోగాలో అయ్యప్పను ధర్మశాస్తా అని పిలుస్తూనే యోగశాస్త్ర అంటారు. యోగాలో మూలాధారం -గణపతి, స్వాధిష్ఠానం-అమ్మవా రు, మ ణిపురం -బొడ్డు(విష్ణు), అనాహతం-భాస్కరుడు (సూర్యుడు),విశుద్ధం-కంఠం(శివుడు), ఆజ్ఞాచక్రం-నుదురు, సహస్రారం-మాడు(పరబ్రహ్మం) ఉంటాయి. ఈ పరబ్రహ్మం కోసమే దీక్ష ద్వారా సాధన చేయొచ్చు. తద్వారా ప్రకృతి(మాయ)ని జయించి పురుషాత్మకం తెలుసుకోవచ్చు. 'ప్రకృతి పురుషాత్మకం జగత్'. నువ్వే దేవుడవు.. దేవుడే నువ్వు అనే తత్వాన్ని తెలుసుకునేందుకు అయ్యప్ప దీక్షను మించిన దీక్ష లేదు.

■ అయ్యప్ప దీక్షలో పంచాయతనం (ఐదుగురు దేవుళ్లను ఏకకాలంలో పూజించడం) చేయవచ్చు. అగ్నికి అమ్మవారు (మహేశ్వరి), ఆకాశానికి విష్ణువు (వ్యాపించి ఉండేవాడు), నీటికి గణపతి, వాయువుకు సూర్యుడు, పృథ్వికి శివుడు అధిష్ఠాన దేవతలు. అదేవిధంగా మానవ శరీరంలోని పంచ జ్ఞానేంద్రియాలను నియంత్రించుకోవడం చేస్తే దీక్షా సాధకుడు అత్యమసి వైపు ప్రయాణిస్తాడు. పంచ జ్ఞానేంద్రియాల్లో కళ్లు–అగ్ని (జఠరాగ్ని), చెవులు–శబ్దం (ఆకాశం), ముక్కు–వాయువు (వాసన), చర్మం–భూమి (పృథ్వి), జలం–ఆహారం (జిహ్వా)లకు ప్రతీకలుగా ఉంటాయి. వీటిని నిగ్రహించుకోవడం కీలకం.

■ మోక్ష సాధనకు మానవ జీవితం మాత్రమే ఉపయోగపడుతుంది. ఇంతటి మానవ జన్మలో అంతశ్శుద్ధి, బహిశ్శుద్ధితో దైవాన్ని ఆవాహన చేసుకుని పూజించాలి. వేదమంత్రాలు, పురాణోక్త మంత్రాలతో శోఢచోపచార పూజలు, ముద్ర విధానం, మంత్ర విధానం సమన్వయం చేసుకుని పూజించడంతో దేవుడు త్వరగా ప్రసన్నం అవుతాడు. అయ్యప్ప స్వామి 18 మెట్లు అనేవి జన్మజన్మల నుంచి వచ్చిన దుష్కర్మలను దూరం చేసేందుకు చేసే సాధన ప్రక్రియకు సోపానాలు.



తోటి స్వాములతో శబరి కొండపై గురుస్వామి శర్మ

ఇంటింటి కుటుంబ
సర్వేకు సన్నద్ధం

- ఉపాధ్యాయులు మధ్యాహ్నం తర్వాతే సర్వే చేయాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్‌: రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న అన్ని వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకు ఈ నెల 6 నుంచి చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వే కోసం జిల్లాలో అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత కాల వ్యవధిలో ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) రూపకల్పన ప్రక్రియను పూర్తి చేసి ఎన్యుమరేషన్ బ్లాక్‌లను పక్కాగా గుర్తించాలన్నారు. ఇందుకు పూర్తిస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వేలో భాగస్వాములు చేయాలని, ఏకకాలంలో సర్వే, డేటా ఎంట్రీ సమాంతరంగా జరిగేలా చొరవ చూపాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ఏ ఒక్క నివాస గృహం సైతం తప్పిపోకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం ఒంటి గంట అనంతరం సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సర్వే సందర్భంగా సేకరించిన ఆయా కుటుంబాల స్థితిగతులకు సంబంధించిన వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేలా సరిపడా సంఖ్యలో డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామన్నారు. ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇప్పించామన్నారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో సమావేశమై ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై కీలక సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావులేకుండా సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ కష్టం

ఈ దృశ్యం వేల్పూర్ మండలం కొత్తపల్లి(ఎస్) గ్రామ శివారులోనిది. వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో దానికి మరమ్మతులు చేయించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయభూముల్లో నుంచి ట్రాక్టర్ వెళ్లే సౌకర్యం లేకపోవడంతో సాయిబాబా ఆలయం వెనుకవైపు ప్రాంతం నుంచి ఎద్దుల బండిపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇలా రోడ్డు వరకు తీసుకువచ్చారు. రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, లేకపోతే తమకు ఈ తిప్పలు తప్పవని రైతులు అంటున్నారు. రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి రెండు స్తంభాలు వేసి తమ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను రైతులు కోరుతున్నారు. – వేల్పూర్

తెయూ ఇంజినీరింగ్ కళాశాలకు త్వరలో ఆమోదం

- కొలిక్కి వచ్చే దశలో ప్రతిపాదనలు
- తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు



సీఎం రేవంత్‌రెడ్డితో వీసీల భేటీ కార్యక్రమంలో పాల్గొన్న తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు ఒక కొలిక్కి వచ్చే దశలో ఉన్నాయని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేర్కొన్నట్లు వీసీ ప్రొఫెసర్ టి యాదగిరిరావు తెలిపారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు కొత్తగా నియమితులైన వైస్‌చాన్స్‌లర్లు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీల బలోపేతానికి కృషి చేసి పూర్వవైభవం తీసుకురావాలని సీఎం సూచించారని తెయూ వీసీ తెలిపారు. యూనివర్సిటీలపైన నమ్మకం కల్గించేలా పని చేయాలని, వర్సిటీల గౌరవాన్ని పెంచాలని సూచించారన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీల్లో వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని సీఎం సూచించారన్నారు. మంచి పని చేయడానికి వైస్ చాన్సలర్లకు స్వేచ్ఛ, ప్రభుత్వ సహకారం ఉంటుందని, వీసీలు బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సీఎం కోరినట్లు తెలిపారు. యూనివర్సిటీల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపైన ప్రత్యేక దృష్టిసారించాలని, విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సీఎం సూచించారన్నారు. సీఎంతో భేటీ అనంతరం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి లను కలిసి తెయూలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదలనపై చర్చించినట్లు వీసీ యాదగిరిరావు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయానికి వచ్చిందని, త్వరలోనే ఆమోదించే అవకాశం ఉందని వారు పేర్కొన్నట్లు వీసీ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించండి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలలో కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం మంత్రి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, స మర్థవంతంగా ధాన్యం సేకరణ జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ధాన్యం శుభ్రపరిచే ప్యాడీ క్లీనర్లు, క్యాలిపర్స్ ఇతర సామగ్రి వెంటనే సమకూర్చాలన్నారు. తాలు, తప్ప పేరుతో రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలలో కోతలు విధించకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కాంటా చేయాలన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ ఉత్తర్వులపై చర్చించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక ఫోన్ నెంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపు చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహన్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యిందన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రక్రియ కూడా ప్రారంభం అయ్యిందని, జిల్లాలో 90 మిల్లులు అండర్ టేకింగ్ ఇచ్చాయని మంత్రి దృష్టికి తేగా, కలెక్టర్ ను ప్రత్యేకంగా ప్రశంసించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఎనిమిది వేల మొక్కలు

- నర్సరీల్లో మొక్కలు పెంచాలని అధికారుల ఆదేశాలు
- వచ్చే ఏడాది 'వన మహోత్సవానికి' మొదలైన కసరత్తు
- గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యం 42.40 లక్షల మొక్కలు



డొంకేశ్వర్ నర్సరీలో పాలిథిన్ బ్యాగుల్లో మట్టిని నింపుతున్న దృశ్యం (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): వచ్చే ఏడాది జిల్లాలో మొక్కలు నాటేందుకుగాను గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టింది. పదో విడత 'వన మహోత్సవాన్ని' పూర్తి చేసిన అధికారులు 11వ విడతకు కావాల్సిన మొక్కలను పెంచడానికి చర్యలు చేపట్టింది. ఇందుకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి మట్టిని సేకరించి పాలిథిన్ కవర్లలో విత్తనాలు వేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలందుకున్న ఉపాధిహామీ ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే గతేడాది జీపీకి పదివేల చొప్పున మొక్కలను పెంచగా, ఈసారి ఎనిమిది వేలు పెంచాలని నిర్ణయించారు. ఈ ఏడాది మొక్క లు నాటగా ప్రతి నర్సరీలో ఇంకా 10 శాతం మొక్క లు ఉన్నాయి. దీంతో పెంచే మొక్కల లక్ష్యాన్ని తగ్గించారు. పోయిన ఏడాది 55 లక్షల మొక్కలను పెంచగా,ఇప్పుడు 42.40 లక్షలు పెంచనున్నారు. ప్రత్యేకంగా తాటి మొక్కలను పెంచాలని భావిస్తున్నారు.

పాలిథిన్ బ్యాగులు..

మొక్కలను పెంచడానికి అవసరమైన పాలిథిన్ బ్యాగులను కొనుగోలు చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. టెండరు ద్వారా వీటిని కొనుగోలు చేయనున్నారు. టెండర్లు పూర్తయిన వెంటనే పాలిథిన్ బ్యాగులు మండలాలు, గ్రామాలకు సరఫరా కానున్నాయి. అప్పటి వరకు ఎర్రమట్టిని సేకరించాలని మండలాల అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. అయితే నర్సరీల్లో మొక్కలు పెంచడానికి ప్రతి ఏడాది ఎర్రమట్టి కొరత ఏర్పడుతోంది. రెవెన్యూ అధికారుల సహకారం లేకపోవడంతో మట్టిని తెప్పించుకోవడానికి ఉపాధి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి అలాంటి ఇబ్బందులు రాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బంది కోరుతున్నారు.

నర్సరీలు సిద్ధం చేయాలి



వచ్చే ఏడాది మొక్కలు నాటే కార్యక్రమానికి అవసరమయ్యే మొక్కలను పెంచడానికి గ్రామాల్లోని ఉపాధిహామీ నర్సరీలను సిద్ధం చేయాలని మండల స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పాలిథిన్ బ్యాగులు రాగానే మట్టి నింపి విత్తనాలు వేయాలి. మొక్కలు సక్రమంగా ఎదిగేవిధంగా ఉపాధి కూలీల ద్వారా నీటిని క్రమంగా అందించాలి. ఎర్రమట్టి కొరత ఉంటే మా దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తాం.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో

నగరంలోని మాధవనగర్ బైపాస్‌లో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు



ఇందూరుపై మంచు దుప్పటి

జిల్లాను శనివారం పొగమంచు కమ్మేసింది. నగరంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగ మంచు వీడలేదు. ఎదురుగా ఏమీ కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

క్లుప్తంగా

చేపూర్‌వాసికి ఫార్మసీలో డాక్టరేట్‌



ఆర్మూర్‌: మండలంలోని చేపూర్‌ గ్రామానికి చెందిన సారంగి రమేశ్‌కు ఫార్మసీ రంగంలో చేసిన పరిశోధనలకుగాను డాక్టరేట్‌ లభించినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్‌ టెక్నాలజీ ఫార్మసీ విభాగంలో ప్రొఫెసర్‌ టీ పార్థసారథి పర్యవేక్షణలో క్యాన్సర్‌పై చేసిన డిజైన్సన్‌ థీసిస్‌ అండ్‌ ఫార్మలోజికల్‌ ఎవల్యూషన్‌ ఆఫ్‌ నోవెల్‌ బయో ఇంటర్‌ కాలిక్యులేషన్స్‌ ఆస్‌ పాసిబుల్‌ యాంటీ క్యాన్సర్‌ ఏజెంట్స్‌ అనే అంశంపై చేసిన పరిశోధనకు రమేశ్‌ అందుకున్నాడని వివరించారు. రమేశ్‌ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని విజయ్‌ కాలేజీ ఆఫ్‌ ఫార్మసీలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రమేశ్‌ డాక్టరేట్‌ అందుకోవడంపై గ్రామస్తులతోపాటు ఎల్‌ఎఫ్‌ఎల్‌ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం అశోక్‌, బాస్‌ రమేశ్‌, వికాస్‌ కాలేజీ ఆఫ్‌ ఫార్మసీ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ సాయిలు, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజశేఖర్‌, ఉపేందర్‌ అభినందనలు తెలిపారు.

శానిటేషన్‌ సిబ్బంది విచారణ

నిజామాబాద్‌ సిటీ: మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య సిబ్బందిని కమిషనర్‌ విచారించారు. శనివారం సాయంత్రం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లను తన చాంబర్‌కు పిలిపించుకున్నారు. మున్సిపల్‌ వర్కర్లకు డ్యూటీలు వేయడం, జరుగుతున్న పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం సర్కిల్‌–5లో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్నేహపూర్వకంగా పనులు చేసుకోవాలని, భౌతిక దాడులకు దిగొద్దని హెచ్చరించారు. మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని అవుట్‌సోర్సింగ్‌ జవాన్‌ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌ను హెచ్చరించారు.

నూతన చట్టాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: నూతన చట్టాలపై పోలీసు అధికారులకు కామారెడ్డి కోర్టులో శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నేరాలకు సంబంధించి విచారణ, తనిఖీలు, సీజింగ్‌, అరెస్టులు, ఫొటోలు, వీడియోల సేకరణ తదితర అంశాలపై పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ దామోదర్‌రెడ్డి, ఏపీపీ అశోక్‌ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, దేవునిపల్లి రాజంపేట, భిక్కనూరు, రామారెడ్డి, సదాశివనగర్‌, బీబీపేట ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సునీల్‌రెడ్డి భరోసా



బాల్కొండ: ఉపాధి నిమిత్తం ఖతర్‌కు వెళ్లి బ్రెయిన్‌ స్ట్రోక్‌బారిన పడిన ముప్కాల్‌ మండలం నాగంపేట్‌కు చెందిన బదనాపల్లి సాయన్నకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స చేయించేందుకు నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. సాయన్న చికిత్స కోసం ఎల్‌వోసీ ఇప్పించి ఉచితంగా చికిత్స అందేలా కృషి చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీఏలో ప్రవేశానికి నోటిఫికేషన్‌

నిజామాబాద్‌ అర్బన్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రవేశానికి నోటిఫికేషన్‌ విడుదలైనట్లు వర్సిటీ కో ఆర్డినేటర్‌ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్లై చేసి దరఖాస్తులను స్టడీ సెంటర్‌లో ఇవ్వాలని సూచించారు. అలాగే డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అణగారిన వర్గాల కోసం సమగ్ర కుటుంబ సర్వే

- కాంగ్రెస్‌ శ్రేణులు పాల్గొనాలి
- తెలంగాణపై ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికాదు
  పసుపు బోర్డు, స్మార్ట్‌ సిటీ ఎక్కడ?
- లిక్కర్‌, డ్రగ్స్‌కు కేరాఫ్‌ కేసీఆర్‌ కుటుంబం
- రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ ఆర్‌ భూపతిరెడ్డి



పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌ సిటీ: అణగారిన వర్గాలకు ఉపయోగపడే విధంగానే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతుందని, అగ్రనేత రాహుల్‌ గాంధీ ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సర్వే అనంతరం తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కాంగ్రెస్‌ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర సర్వేతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ ఆలోచన కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ నుంచి వచ్చిందన్నారు. సర్వేలో భాగంగా కులాల లెక్కలు సైతం తేలుతాయన్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితి తెలుస్తుందన్నారు. కులగణన అనేది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్‌ నాయకులందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సామాజిక న్యాయం చేస్తామంటున్న బీజేపీ కులగణన చేయలేదని విమర్శించారు. తెలంగాణలో కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలబడడమే ప్రభుత్వ ఆలోచన అన్నారు. సజావుగా సర్వే కొనసాగేందుకు యంత్రాంగానికి కాంగ్రెస్‌ కార్యకర్తలు సహకరించాలన్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు కాలేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. తెలంగాణలో మహిళకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్‌ సిలిండర్‌, వేల ఉద్యోగాల భర్తీ చేశామని తెలిపారు. లిక్కర్‌కు, డ్రగ్స్‌కు, భూముల ఆక్రమణకు సూత్రధారులుగా కేసీఆర్‌ కుటుంబం ఉందని విమర్శించారు. బీజేపీ నాయకులు చెప్పే పసుపు బోర్డు, స్మార్ట్‌ సిటీ ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేషన్‌ల చైర్మన్‌లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌ బిన్‌ హందాన్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ తారాచంద్‌, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ చంద్రశేఖర్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌లు ముప్ప గంగారెడ్డి, ముత్యంరెడ్డి, పాలెపు నర్సయ్య, సాయిబాబాగౌడ్‌, కార్పొరేటర్‌ గడుగు రోహిత్‌, పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌ గౌడ్‌, నాయకులు వేణుగోపాల్‌యాదవ్‌, జావేద్‌ అక్రమ్‌, రామర్తిగోపి, విక్కీయాదవ్‌, వేణురాజ్‌, బోర్గాం శ్రీనివాస్‌, మహిళా కాంగ్రెస్‌ నాయకులు ఆకుల సుజాత, చాంగుబాయి, అపర్ణ, ఆయా మండలాల అధ్యక్షులు, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సివిల్‌ సప్లయీస్‌ డీఎం



అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎం రాజేశ్వర్‌

సుభాష్‌నగర్‌: సివిల్‌ సప్లయీస్‌ కార్పొరేషన్‌ జిల్లా మేనేజర్‌గా అంబదాస్‌ రాజేశ్వర్‌ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం అంబదాస్‌ రాజేశ్వర్‌ కలెక్టర్‌ రా జీవ్‌గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణ విజ యవంతంగా పూర్తి చేస్తామని, సేకరణ ప్రక్రియలో లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపడుతామన్నారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా ధాన్యం సేకరిస్తామని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

కవితారచనలో రాష్ట్రస్థాయి బహుమతి



నిజామాబాద్‌ రూరల్‌: పెందోట సాహిత్య పీఠం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవిత రచన పోటీల్లో గుండారం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినికె గంగలక్ష్మికి ప్రోత్సాహక బహుమతి లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు అమర్నాథ్‌ శనివారం తెలిపారు. పెందోట సాహితి పీఠం ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని గంగలక్ష్మి రాసిన 'ప్రకృతి' అనే కవితకు ప్రోత్సాహక బహుమతి లభించిందన్నారు. విద్యార్థినిని శనివారం పాఠశాలలో అభినందించారు. విద్యార్థినిని కవితా రచనలవైపు ప్రోత్సహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావును ఆయన హెచ్‌ఎం అభినందించారు. ఈ నెలాఖరులో సిద్దిపేటలో నిర్వహించనున్న సాహిత్య కార్యక్రమంలో గంగలక్ష్మికి నిర్వాహకులు బహుమతిని అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అహల్య, వారె దస్తగిరి, నరేంద్రమూర్తి, గిరిధర్‌, ఆరోగ్యరాజ్‌, వినోద్‌కుమార్‌, ప్రణీత, శుభాదేశ్‌ పాండే, భగవాన్‌దాస్‌ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై విచారణ

సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ రూరల్‌ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయ పరిధిలోగల సారంగాపూర్‌, ఖానాపూర్‌ శివార్లలో అక్రమంగా వెలసిన వెంచర్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై విచారణ మొదలైంది. ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌ ప్రసూన ఆదేశించారు.

నవంబర్‌ 1న జిల్లాకు చెందిన ఓ సీనియర్‌ అసిస్టెంట్‌ రూరల్‌ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో విధులు చేపట్టారు. ఇద్దరు సీనియర్‌ డాక్యుమెంట్‌ రైటర్లతో బేరం కుదుర్చుకుని అక్రమ వెంచర్‌లో వేల గజాలను రిజిస్ట్రేషన్‌ చేశారనే ఆరోపణలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారినట్లు కూడా విమర్శలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో ఆ రిజిస్ట్రేషన్‌ డాక్యుమెంట్లపై శాఖ ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. ఆరోపణలపై స్పందించిన డీఆర్‌ ప్రసూన వెంటనే విచారణ చేపట్టి, నివేదిక అందించాలని ఆదేశించారు.

ఎంఎస్‌ఎన్‌ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



భిక్కనూరులోని ఎంఎస్‌ఎన్‌ కెమికల్‌ ఫ్యాక్టరీలో ధర్నా చేస్తున్న కార్మికులు

భిక్కనూరు: మండలంలోని ఎంఎస్‌ఎన్‌ కెమికల్‌ ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. భోజన విరామ సమయానికి అరగంటకు కుదించారని, తాము చేతులను శుభ్రం చేసుకునేందుకే ఇరవై నిమిషాల సమయం పడుతోందన్నారు. అలాగే పీఎఫ్‌ డబ్బులకు సంబంధించి తమకు ఎలాంటి పత్రాలను ఇవ్వడం లేదని, వేతనాలను పెంచడం లేదని, అదనంగా పని చేసినప్పుడు నిబంధనల ప్రకారం భోజన సౌకర్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ తమ వేతనంలో నుంచి డబ్బులు కట్‌ చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. హెచ్‌ఆర్‌ సుబ్బారావు కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వచ్చే వరకు ఆందోళనను విరమించేది లేదని కార్మికులు మొండి కేశారు. దీంతో ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎస్‌ఎన్‌ కెమికల్‌ ఫ్యాక్టరీల హెచ్‌వోడీ మోహన్‌రావు భిక్కనూరుకు చేరుకుని కార్మికులతో మాట్లాడారు. ఐదురోజుల్లో తమకు లిఖిత పూర్వకంగా సమస్యలను తెలిపితే వెంటనే వాటిని పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



భిక్కనూరు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ నివారణ చర్యలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ ఎయిడ్స్‌ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన సౌత్‌ క్యాంపస్‌ సోషల్‌ డిపార్ట్‌మెంట్‌ విద్యార్థులకు అడిషనల్‌ కలెక్టర్లు శ్రీనివాస్‌, విక్టర్‌ శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం అధికారి అంజయ్య, ఎయిడ్స్‌ నివారణ జిల్లా అధికారి రాధిక, డీపీవో చల్ల సుధాకర్‌, ప్రిన్సిపాల్‌ సుధాకర్‌గౌడ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

ట్రాక్టర్‌ పైనుంచి పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్‌: మండలంలోని సంగం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ పైనుంచి పడి వర్ని మండలానికి చెందిన కాశీరాం (47) అనే వ్యక్తి మృతిచెందినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వర్ని మండలంలోని పాతవర్నికి చెందిన కాశీరాం ట్రాక్టర్‌ డ్రైవర్‌ హరీశ్‌తో కలిసి శనివారం ఉదయం సంగం శివారులో కూలీ పని వచ్చాడు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా పొలాల్లో నుంచి మెయిన్‌ రోడ్డుకు ట్రాక్టర్‌ ఎక్కుతుండగా డ్రైవర్‌ పక్కన కూర్చొని ఉన్న కాశీరాం ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్‌ చక్రాలు పైనుంచి వెళ్లడంతో కాశీరాం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఐదు రోజుల క్రితం రైల్వే స్టేషన్‌ రోడ్డు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ హెచ్‌ వో రఘుపతి తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు..



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో విజయలక్ష్మి గార్డెన్‌ వద్ద విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. మామిడిపల్లికి చెందిన ఆకుల రాజేశ్వర్‌ కు చెందిన ఓ గేదెతోపాటు మల్యాల పెద్ద భోజన్న అనే వ్యక్తికి చెందిన రెండు గేదేలు మృతి చెందాయి. సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్‌, రెవెన్యూ, వెటర్నరీశాఖల అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా బాధితులు అధికారులను కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్‌: సాలూర, బోధన్‌ మండలంలోని గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్‌ చేసి కేసులు నమోదు చేశామన్నారు.

ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: ఒంటరితనాన్ని భరించలేక జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నేవూరి హన్మాండ్లు(65) భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా కుటుంబ సభ్యులకు దూరంగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన హన్మాండ్లు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. శనివారం గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయం సమీపంలోని బర్రెల మంద వద్ద గ్రామస్తులకు హన్మాండ్లు మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఒంటరితనం కారణంగా జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కొడుకు నరేందర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

రైలు కిందపడి..

ఖలీల్‌ వాడి: నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌ పరిధిలోని అర్సపల్లి వద్ద రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. రైల్వే స్టేషన్‌ మేనేజర్‌ రమేశ్‌ సమాచారం మేరకు శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించామని, మృతుడిని మోస్రా మండలంలోని గోవూరుకు చెందిన సోమ నర్సయ్య (42)గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన కొండూరు గంగాధర్‌(55) కాకతీయ కాలువలో శుక్రవారం గల్లంతైన విషయం తెలిసిందే. నీటి విడుదలను నిలిపి వేసి గాలింపు చర్యలు చేపట్టగా శనివారం మృత దేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెండోరా ఎస్సై నారాయణ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్‌ హనుమంతు

ఇందల్వాయి: మండలంలోని ఇందల్వాయి, ఎల్లరెడ్డిపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగంగా చేపట్టేందుకు కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్‌ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం సేకరించిన వెంటనే సంబంధిత రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తరలింపుతోపాటు రైస్‌ మిల్లుల్లో త్వరగా అన్‌లోడ్‌ అయ్యేలా చూడాలని సూచించారు. గన్నీ బ్యాగుల కొరత రాకుండా చూడాలని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్‌ వెంట అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌, ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ తారాచంద్‌ నాయక్‌, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్‌ సప్లయీస్‌ డీఎం అంబదాస్‌ రాజేశ్వర్‌, డీసీవో శ్రీనివాస్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ గోవర్ధన్‌రెడ్డి, సీఈవో రతన్‌ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్‌ జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులతో క్రీడాధికారులు, ఉపాధ్యాయులు

నిజామాబాద్‌ రూరల్‌: ఖమ్మం, హైదరాబాద్‌లలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీలకు అండర్‌ –17, 19 బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు మండలంలోని సారంగపూర్‌ ఉన్నత పాఠశాల పీడీ రంగు కృష్ణంరాజు శనివారం తెలిపారు. ఎంపిక పోటీలకు నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర జట్లను తమ పాఠశాలలో ఎంపిక చేయడం గర్వంగా ఉందని హెచ్‌ఎం లలిత అన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్‌ ప్రధాన కార్యదర్శి సల్ల సత్యనారాయణ, ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి నాగమణి, పీడీలు శ్రీధర్‌, నాగరాజు, పీఈటీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గోపాల్‌, గంగాధర్‌, జావిద్‌ పాల్గొన్నారు.

బాల్‌ బ్యాడ్మింటన్‌ ఎంపిక పోటీలు



శిక్షణకు ఎంపికైన బాల్‌బ్యాడ్మింటన్‌ క్రీడాకారులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి విజయ్‌ హైస్కూల్‌లో శనివారం బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా సీనియర్‌ మహిళ, పురుషుల బాల్‌ బ్యాడ్మింటన్‌ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన బాలురకు రెంజల్‌ హైస్కూల్‌లో, బాలికలకు మోర్తాడ్‌ గరల్స్‌ హైస్కూల్‌లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్‌, ప్రధాన కార్యదర్శి బీ శ్యామ్‌ తెలిపారు. హనుమకొండలో ఈ నెల 8 నుంచి నిర్వహించే 70వ రాష్ట్ర స్థాయి సీనియర్‌ పురుషుల, మహిళల బాల్‌బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో విజయ్‌ హైస్కూల్‌ ప్రిన్సిపాల్‌ కవితాదివాకర్‌, సీనియర్‌ క్రీడాకారులు ఆర్‌ అండ్‌ బీ ఇంజినీర్‌ నామ్‌దేవ్‌, కృష్ణమూర్తి, సురేశ్‌, సింధూజ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్‌ టోర్నీ ప్రారంభం



శిక్షణ శిబిరంలో క్రీడాకారులు

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో జిల్లా స్థాయి వాలీబాల్‌ టోర్నీని శనివారం ప్రారంభించారు. జెడ్పీహెచ్‌ఎస్‌ పీజీహెచ్‌ఎం లాల్‌సింగ్‌, పీఎస్‌ హెచ్‌ఎం సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్‌ సంపత్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌, యూత్‌ కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు జీవన్‌ నాయక్‌, గౌసొద్దీన్‌, సంతోష్‌నాయక్‌, ఆకుల జగన్‌, చందర్‌, మహేందర్‌, రాంసింగ్‌, బుచ్చన్న, సింగర్‌ మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌లకు అనుమతి తప్పనిసరి



ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

ఖలీల్‌వాడి: డ్రోన్‌ వినియోగానికి అనుమతి తప్పనిసరి అని, పోలీసు, ఏవియేషన్‌ అధికారుల నుంచి క్లియరెన్స్‌ తీసుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్‌ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. భారీ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయొద్దని, కమిషనరేట్‌ పరిధిలో డీజేలపై నిషేధం ఉందని తెలిపారు. సభలు, సమావేశాలు జనసంచార ప్రదేశాల్లో లౌడ్‌ స్పీకర్లు పెట్టాలనుకునేవారు అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలనుకునే వారు సంబంధిత అసిస్టెంట్‌ పోలీస్‌ కమిషనర్‌ అనుమతి తీసుకోవాలన్నారు. 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమానికి 72 గంటల ముందు కమిషనర్‌ తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మాల్స్‌, సినిమా థియేటర్లు, హోటళ్లు, ఎగ్జిబిషన్‌, బిజినెస్‌ ప్రదేశాల్లో సెక్యూరిటీ నిబంధనలను పాటించాలన్నారు. 'ఏ' సర్టిఫికెట్‌ సినిమాలు ప్రదర్శించే థియేటర్లలోకి మైనర్లను అనుమతించొద్దని సూచించారు. అనుమానాస్పద స్థితిలో వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. గల్ఫ్‌లో ఉపాధి పేరిట నకిలీ గల్ఫ్‌ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని, ఎవరైనా గల్ఫ్‌ ఏజెంట్లు ఇళ్లు కిరాయి కోసం వస్తే పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిబంధనలు ఈనెల 1 నుంచి 15 తేదీ వరకు అమలులో ఉంటాయని ఇన్‌చార్జి సీపీ తెలిపారు.

చెట్టు కొమ్మ విషయంలో ఘర్షణ



గాయాలపాలైన వెంకట్‌గౌడ్‌

బీబీపేట: మేకలకు చెట్టు కొమ్మ తీసుకునే విషయంలో ఘర్షణ పడి ఒకరిపై మరొకరు పిడిగుద్దులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని తుజాల్‌పూర్‌ గ్రామ శివారులో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండ మండలం అంబారిపేటకు చెందిన రాజశేఖర్‌గౌడ్‌ నూతన గృహ ప్రవేశం ఉండడంతో ఆయనతోపాటు అతడి అన్న సంజీవ్‌గౌడ్‌, మామ వెంకట్‌గౌడ్‌, తమ్ముడు అక్షిత్‌గౌడ్‌ కలిసి వాహనంలో దుబ్బాకకు వెళ్లి మేకలు కొనుగోలు చేసుకుని వస్తున్నారు. తుజాల్‌పూర్‌ శివారులో వాహనాన్ని ఆపి మేకల కోసం రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మలు తెంపుతుండగా తుజాల్‌పూర్‌ గ్రామానికి చెందిన తలారి బాబు, అనంతయ్య, కమలాకర్‌, సూర్యం, దివాకర్‌, కుమార్‌ అక్కడకు చేరుకొని వారితో ఘర్షణ పడ్డారు. ఇక్కడ చెట్టు కొమ్మలు తీయడానికి వీలులేదని దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఈ ఘటనలో వెంకట్‌గౌడ్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు ఫోన్‌ చేయడంతో ఇరువురిని పోలీసు స్టేషన్‌కు రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

బాన్సువాడ/పిట్లం/బీబీపేట/బోధన్‌రూరల్‌: బాన్సువాడ పట్టణంతోపాటు పిట్లం, బీబీపేట, బోధన్‌ రూరల్‌ మండలాల్లో పేకాటస్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొయ్యగుట్ట సమీపంలో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి 13 మందిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.34వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పిట్లం మండలంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయా చోట్ల 18 మందిని అరెస్టు చేసి రూ.14వేల నగదు, 18 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బీబీపేట మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు. నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరిచామన్నారు. బోధన్‌ మండలంలోని కొప్పర్గ గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.93,730 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.